క్లుప్తంగా

30న రాతి దూలం లాగుడు పోటీలు

తుగ్గలి: సద్గురు కాశిరెడ్డినాయన ఆలయ వారి కోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 30న రాంపల్లిలో న్యూ క్యాటగిరీ ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు బుధవారం గ్రామస్తులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గెలుపొందిన వృషభ యజమానులకు బహుమతి దాతలు వరుసగా అవకు మండలం సంగపట్నం లక్ష్మీదేవి రూ.40వేలు, రాంపల్లి కిష్టన్న, నల్లగుండ్ల రామయ్య, అగ్రహారం కోదండరాముడు కలిసి రూ.30వేలు, పగిడిరాయి నెట్టికంటి రూ.20వేలు, రాంపల్లి రాజు, లక్ష్మన్న, చనుగొండ సుంకన్న కలిసి రూ.15 వేలు, రాంపల్లి హనుమంతు రూ.10వేలు అందజేస్తారని వెల్లడించారు. అదే విధంగా చెక్కభజన పోటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనేందుకు వృషభ యజమానులు, చెక్క భజన బృందాలు 9440097301, 6305718596 ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

దర్గా అభివృద్ధికి రూ.లక్ష విరాళం


నగదు అందజేస్తున్న దాత రామానాయుడు

తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో వెలసిన దస్తగిరిస్వామి దర్గా అభివృద్ధికి గ్రామానికి చెందిన రైతు పెడసాని రామానాయుడు రూ.లక్ష విరాళం అందజేశారు. దర్గాకు అవసరమైన స్థలం కొనుగోలుకు రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు దాత తెలిపారు. దర్గా అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. దాతను గ్రామస్తులు అభినందించారు.

విత్తన శుద్ధితో తెగుళ్లకు చెక్

మద్దికెర: వేరుశనగ విత్తనం వేసే ముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని.. ఇలా చేయడం వల్ల పంటకు తెగుళ్లు సోకవని ఏఓ రవి అన్నారు. బుధవారం రైతుల సమావేశంలో విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక కిలో విత్తనాలకు ఇమిడాక్లోప్రిడ్ 2 ఎంఎల్ కలిపి విత్తనశుద్ధి చేయడం వల్ల రసంపీల్చు పురుగుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. అలాగే వేరుపురుగు ఆశించకుండా క్లోరిపైరిఫాస్ 6 ఎంఎల్, భూమి ద్వారా వచ్చే తెగుళ్లను అరికట్టడానికి ఫ్లాక్సా పెరాక్సైడ్ 1 ఎంఎల్, జీవశిలీంద్రనాశకాలైన ట్రైకోడెర్మావిరిడి 6 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేయడం వల్ల పంటలను సంరక్షించుకోవచ్చన్నారు. రైతులు పంటలసాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

మద్దికెర: వర్షాలు కురుస్తుండడంతో నీరు నిల్వ ఉండడం, కాలువల్లో మురుగు పెరిగి దోమలు వ్యాప్తి చెందే ప్రమాదముందని వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సర్పంచ్ సుహాసిని, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి అన్నారు.బుధవారం సిబ్బందితో మాట్లాడుతూ.. దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఇప్పటికే పనులు చేపడుతున్నా కొన్ని చోట్ల నీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని పేర్కొన్నారు. ప్రజలు రోడ్లపై చెత్తవేయకుండా సహకరించాలని కోరారు.

కుక్కకాటుకు గురైన వ్యక్తి మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): కుక్కకాటకు గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామానికి చెందిన కొమ్ము రామాంజనేయులు(62) వారం రోజుల క్రితం కుక్కకాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని రైతు సంఘం అధ్యక్షుడు ఈదుల వెంకటరాముడు, పార్థయ్య, మనోహర్‌యాదవ్, రామాంజనేయులు తదితరులు పరామర్శించారు.

పోస్టల్ స్కీమ్‌లో అవకతవకలపై విచారణ


నంచర్ల గ్రామంలో విచారిస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అభిషేక్

చిప్పగిరి: వివిధ పోస్టల్ స్కీమ్‌లలో నగదు కట్టించుకుని ఖాతాలకు జమచేయకుండా బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ శాంతమ్మ (బీపీఎం), రిటైర్డ్ పోస్టుమాస్టర్ కుమారుడు మల్లీ అవకతవకలకు పాల్పడ్డారని మండలంలోని నంచర్ల గ్రామస్తుల ఫిర్యాదుతో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అభిషేక్ బుధవారం విచారణ చేశారు. ఖాతాదారుల నుంచి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. బీపీఎం శాంతమ్మను సస్పెండ్ చేశారు.

కరువు పరిస్థితిని నివేదిస్తాం

- ఆలూరులో పర్యటించిన కేంద్ర బృందం
- ఎండిన పంటల ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలన


ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం



వ్యవసాయ అధికారులు, రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

ఆలూరు: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 2022–23 ఆర్థిక సంవత్సరం రబీ సీజన్‌లో శనగ, వాము, జొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. కరువు పరిస్థితిని తెలుసుకునేందుకు కేంద్ర బృందం బుధవారం ఆలూరుకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వ డిపార్టుమెంటు ఆఫ్ ఎక్స్‌పెండేచర్ డైరెక్టర్ సీపీ రావు గాట్మేర్ ఆధ్వర్యంలో తాగునీరు, పారిశుద్ధ్య శాఖ డిప్యూటీ అడ్వైజర్ అసిస్ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవింద్ కుమార్ సోనిలతో కూడిన సెంట్రల్ టీమ్ కరువు పరిస్థితి ప్రతిబంబించే ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించింది. ఆలూరు 4వ రైతు భరోసా కేంద్రంలో జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వరలక్ష్మి వారికి పంట నష్టాన్ని వివరించారు. జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో 58,770 హెక్టార్లలో సాగు చేసిన 58,900 మంది రైతులు నష్టపోయారని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం డైరెక్టర్ సీపీ రావు గాట్మేర్ రైతులు, ప్రజాసంఘాలకు చెందిన నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు దానికి అనుగుణంగా రైతులు పంటలు సాగుపై వ్యవసాయ అధికారులు తగిన సలహాలు, సూచనలు అందించాలన్నారు. కరువు పరిస్థితిని కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా వర్షాధార పంటలపై ఆధారపడి సాగు చేస్తున్నారని.. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటేశ్వర్లు, రామకృష్ణ, నారాయణస్వామి, ఈరన్న, హనుమంతు, నారాయణరెడ్డి కేంద్రం బృందానికి విజ్ఞప్తి చేశారు. డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఏపీ ఎంఐపీ ఉమాదేవి, పశుసంవర్ధకశాఖ జేడీ శ్రీనివాసులు, మత్స్యశాఖ అధికారిణి డి.శామలమ్మ, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, ఆలూరు ఎంపీపీ రంగమ్మ, సర్పంచ్ అరుణాదేవి, సునీత, తహసీల్దార్ చంద్రశేఖరయ్య, ఎంపీడీఓ నరేంద్ర కుమార్, ఏడీఏ సి.విక్టర్‌బాబు తదితరులు ఉన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు


షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న చైల్డ్ లేబర్ సహాయ అధికారి నీలిమా సంధ్య

వెల్దుర్తి(కృష్ణగిరి): చిన్నారులను పనుల్లో పెట్టుకున్నా.. వారితో పనులు చేయించినా కఠిన చర్యలు తప్పవని జోన్ చైల్డ్ లేబర్ సహాయ అధికారి నీలిమా సంధ్య హెచ్చరించారు. బుధవారం వెల్దుర్తిలో ఎన్‌సీపీసీఆర్ చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బేకరీలు, కిరాణ, మెకానిక్ షాపులు, హోటల్లో తనిఖీలు చేశారు. ఎక్కడైనా చిన్నారులను పెట్టుకుని వారితో పని చేయిస్తే సంబంధిత యజమానికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. పిల్లలతో పని చేయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఆమె వెంట సహాయ కార్మిక అధికారి కేశన్న, రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

ములుగుందం.. మురుగుమయం


ములుగుందం బీసీ కాలనీలో నిలిచిన వర్షపు నీరు

ఆస్పరి: మండలంలోని ములుగుందం ఎస్సీ, బీసీ కాలనీలు మురుగు కుంటలుగా మారాయి. కాలనీల్లో డ్రైనేజీ కాలువలు, సిమెంట్ రోడ్లు వేయకపోవడం వల్ల ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు, వర్షపు నీరు వెళ్లేందుకు అస్కారం లేక ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. దీంతో దుర్గంధం వ్యాపిస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వర్షపు నీరు ఇళ్ల ముందే ఆగిపోవడంతో నడవడానికి కూడా వీలులేకుండా ఉందని వాపోతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఎస్సీ, బీసీ కాలనీల్లో డ్రైనేజీ కాలువలు, సిమెంట్ రోడ్లు వేయించాలని కోరుతున్నారు.


ఇంటి ముందు బురదమయంగా మారిన రోడ్డు

సర్టిఫికెట్ల జారీపై కొత్త మార్గదర్శకాలు

హాలహర్వి: సచివాలయాల్లో సర్టిఫికెట్ల జారీపై కొత్త మార్గదర్శకాలు వచ్చేంత వరకు గ్రామ, వార్డు సచివాలయాలు, మీసేవా ద్వారా ఎలాంటి రాజకీయ సంబంధిత వ్యక్తుల ఫొటోలు లేదా గుర్తులు వాడొద్దని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని ఎంపీడీఓ ఆంథోని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఉపయోగించిన పత్రాలతోనే సర్టిఫికెట్లను జారీ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

జోరుగా విత్తన పనులు


ట్రాక్టర్ ద్వారా విత్తనం వేస్తున్న రైతు

మద్దికెర: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు జోరుగా విత్తన పనులు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఎర్రనేలల్లో వేరుశనగ, కంది పంటలు సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయాధికారులు ముందుగానే విత్తన పంపిణీ చేయడం, అడపాదడపా వానలు కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్డీఓకు సన్మానం


ఆర్డీఓను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

పత్తికొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా విజయవంతంగా పూర్తి చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, ఆర్డీఓ నీలపు రామలక్ష్మిని పత్తికొండ రెవెన్యూ డివిజన్ అధికారులు, సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడు నాగరాజు, సెక్రటరీ మల్లికార్జున, ట్రెజరర్ రమేష్, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బాబు, సభ్యులు ఈరమ్మ, రాందాసు, వీరేష్ ఆర్డీఓను శాలువా, పూలమాలలతో సత్కరించారు.

జింకలతో పంట నష్టపోతున్నాం

ఆస్పరి: ఖరీఫ్ సీజన్‌లో వేసిన వేరుశనగ, పత్తి, కంది, సజ్జ, జొన్న పంటలపై దాడి చేయకుండా జింకల బారి నుంచి కాపాడాలని మండలంలోని డీకోటకొండ, హలిగేర, చిరుమాన్‌దొడ్డి గ్రామాలకు చెందిన రైతులు బుధవారం ఆస్పరిలో డిప్యూటీ తహసీల్దార్ గాయత్రీకి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు మహా సభ సంఘం జిల్లా సమితి సభ్యుడు మునిస్వామి మాట్లాడుతూ.. ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో వేసిన పంటలపై జింకలు దాడి చేసి నాశనం చేస్తున్నాయన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు రాత్రి వేళల్లో జింకల కోసం కాపాలాగా వెళ్తున్నారన్నారు. మొక్క దశలో ఉన్నప్పుడే జింకలు దాడి చేస్తున్నాయన్నారు. జింకల నుంచి కాపాడాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హోళగుంద మండలంలోని దేవరగట్టు కొండల్లో జింకల పార్కు ఏర్పాటు చేసి ఇక్కడ ఉన్న జింకలను తరలించి రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు హనుమంతు, రంగస్వామి, రాజ్‌కుమార్, బడేసాహెబ్ పాల్గొన్నారు.


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

పెండింగ్ కేసులను పూర్తి చేయండి


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నాగరాజు

ఆదోని అర్బన్: ఆదోని నియోజకవర్గంలో పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని అడిషనల్ ఎస్పీ నాగరాజు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పోలీసు అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. బెట్టింగ్, అక్రమ మద్యం రవాణా, జూదం, పేకాట, మట్కా, గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉక్కుపాదం మోపాలన్నారు. అనంతరం ఒక్కొక్క అధికారితో మాట్లాడి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులు, విచారణ పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం చేయొద్దు

- డీపీఓ నాగరాజునాయుడు


పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీఓ

వెల్దుర్తి(కృష్ణగిరి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని డీపీఓ నాగరాజునాయుడు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం కావడంతో తాగునీటి లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిత్యం తాగునీటి పరీక్షలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఈఓఆర్డీ నరసింహులు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి రథోత్సవం

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని హనుమాన్‌నగర్‌లో వెలిసిన రాజరాజేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ భక్తబృందం ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామున పంచామృతాభిషేకం, అలంకారం, లలిత సహస్రనామం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం రాజరాజేశ్వరిదేవి, పరమేశ్వరులకు కల్యాణోత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. సాయంత్రం పురవీధుల్లో రథోత్సవం కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా సాగింది.రాజేశ్వరి మాతకు జై నామస్మరణతో రథోత్సవం కొనసాగింది. చిన్నారులు, మహిళలు కలశాలతో పాల్గొన్నారు. రాత్రి పల్లకీసేవ, ఏకాంతసేవ చేపట్టారు.


రథోత్సవంలో కలశాలతో పాల్గొన్న చిన్నారులు, మహిళలు

రోడ్డు బాగు చేయించాలని వినతి

హొళగుంద: వందవాగిలి నుంచి ఆదోని మండలం ఢణాపురం వరకు ఉన్న రోడ్డు రాళ్లు తేలి దారుణంగా తయారైందని మరమ్మతు పనులకు చర్యలు తీసుకోవాలని వందవాగిలి గ్రామస్తులు ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని కోరారు. బుధవారం గ్రామస్తులు బొంపల్లి నాగప్ప, ఈరన్న, చిగిలి వీరేష్, నాగప్ప తదితరులు ఆదోనిలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. వందవాగిలి నుంచి ఆదోనికి ప్రతినిత్యం విద్యార్థులు చదువుకోవడానికి వెళ్తుంటారని రోడ్డు బాగలేకపోవడంతో గ్రామానికి, పాఠశాలలకు వేళకు చేరుకోలేకపోతున్నారని తెలిపారు. ఆస్పత్రులు, ఇతర పనుల కోసం తిరిగే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. చర్యలు తీసుకోవాలని కోరారు.


ఆదోని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న వందవాగిలి గ్రామస్తులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఆలూరు: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వహీద్ తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, కామెర్లు వంటి లక్షణాలు ఉంటే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన ర్యాలీ

మద్దికెర: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి వారసత్వంగా వచ్చే ఎర్రరక్తకణాల రుగ్మత వల్ల వస్తుందని.. ఇది తల్లిదండ్రుల నుంచి సంక్రమిస్తుందని ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం మద్దికెరలో ప్రపంచ సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. సాధారణ రక్తకణాలు గుండ్రంగా ఉంటే సికిల్‌సెల్ వ్యాధిలో కొడవలి లాగా అర్ధ చంద్రకారంలో ఉంటాయని తెలిపారు. రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో తీవ్రమైన ఇబ్బందులు, అలసట, తరుచుగా అంటువ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలుంటే సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిగా గుర్తించవచ్చన్నారు. స్థానిక ప్రాథమిక వైద్యకేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోగ నిర్ధారణ అయిన వారికి హైడ్రాక్సి యూరియా మాత్రలు ఇవ్వడంతో పాటు ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తారన్నారు. వ్యాధి స్థాయిని బట్టి ఎముక మజ్జ మార్చడం జరుగుతుందని.. 40 ఏళ్లలోపు వయసున్న వారు ఈ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, సూపర్‌వైజర్ కృష్ణమ్మ, సూర్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ విజయ్, సిబ్బంది అంజలి, లక్ష్మీదేవి, గాయత్రి పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

లారీ ఢీకొని రైతుకు గాయాలు

తుగ్గలి: లారీ ఢీకొని మండల పరిధిలోని రాతనకు చెందిన రైతు ఈరన్న తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం సాయంత్రం తోటకు వెళుతుండగా చెరువు కట్ట సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఈరన్న చేతికి, చాతికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రున్ని గుంతకల్లుకు తరలించారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు తుగ్గలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అడిగిన వారందరికీ పనులు

చిప్పగిరి: జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఏపీఓ మాదవ్ శంకర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలసలను నివారించడానికి స్థానికంగానే పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్‌కార్డు లేని వారు మండల ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.


మాట్లాడుతున్న ఏపీఓ మాదవ శంకర్

వీఆర్‌కు కృష్ణగిరి ఎస్ఐ

కృష్ణగిరి: కృష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డిని వీఆర్‌కు పంపుతూ బుధవారం జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సాయంత్రం ఆయన రిలీవ్ అయ్యారు. ఆ స్థానంలో ఇన్‌చార్జ్‌గా కర్నూలు ఫ్యాక్షన్ జోన్ సీఐ జయన్నను నియమించగా రాత్రి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న ఫ్యాక్షన్ జోన్ సీఐ జయన్న

సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య

తుగ్గలి: నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని జెడ్పీ మాజీ ఛైర్మన్ బత్తిన వెంకటరాముడు అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బుధవారం రామలింగాయపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ వెంకటపతి, హెచ్ఎం రవీంద్రనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న జెడ్పీ మాజీ ఛైర్మన్

విద్యార్థినులకు పుస్తకాల వితరణ


హాస్టల్ వార్డెన్‌కు పుస్తకాలు అందజేస్తున్న దాతలు

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యార్థినుల్లో దాగిన ప్రతిభను బయటకు తీసేందుకు, పోటీ పరీక్షల్లో రాణించేందుకు తగిన సహాయ సహకారాలు అందిస్తామని హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు హరినరసింహనాయుడు తెలిపారు. బుధవా రం వెల్దుర్తి బాలికల బీసీ హాస్టల్‌కు బాల్య సాహిత్య పుస్తకాలు, ఆట వస్తువుల ను వార్డెన్ శైలజకు హిందీ పండిట్ గఫూర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వార్డెన్ మాట్లాడుతూ.. వసతి గృహంలో 600 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. వీరు చదువులో రాణిస్తున్నారని.. ఇలాంటి ప్రోత్సాహంతో మరింత మెరుగ్గా రాణించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే 1989–90 పదో తరగతి బ్యాచ్ కూడా ఇదివరకే పుస్తకాలు ర్యాంపు అందజేశారని తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పత్తికొండ, ఆలూరు
97054 44304 (ఆలూరు, పత్తికొండ)
Office mail : sakshiknladvt@gmail.com